క్లుప్తంగా

నేడు కరెంట్ కోతలు

జనగామ: జనగామ పట్టణంలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల నేపథ్యంలో నేడు (బుధవారం) కరెంటు కోతలు ఉంటాయని ఎన్పీడీసీఎల్ ఏఈ శంకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సూర్యాపేట రోడ్ ఎడమ వైపు (పూర్తిగా), ప్రిస్టన్, దుర్గమ్మ గుడి ఏరియా, శ్రీనివాస్ నగర్ కాలనీ తదితర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కరెంట్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలన్నారు.

ఆర్థికసాయం

దేవరుప్పుల: మండల కేంద్రంలోని కొత్తవాడకు చెందిన కాంగ్రెస్ నాయకుడు ఉప్పుల సోమయ్య భార్య వెంకటమ్మ మృతి చెందింది. కాగా, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పెద్ది కృష్ణమూర్తి బాధిత కుటుంబాన్ని మంగళవారం పరామర్శించి రూ.3 వేల ఆర్థిక సాయం అందజేశారు. గ్రామ అధ్యక్షుడు ఉప్పుల ఉప్పలయ్య, సీనియర్ నాయకులు కారుపోతుల వెంకటయ్య, రాములు, యాదగిరి, రమేష్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాకస్వామి, ఐలయ్య, చెల్మారెడ్డి, అనిల్, మల్లయ్య, ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల అందజేత

జనగామ రూరల్: వాసవీ క్లబ్ గ్రేటర్ జనగామ ఆధ్వర్యంలో డాన్ టు డస్క్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలో రాజరాజేశ్వరీ వృద్ధాశ్రమంలో దుస్తులు, నిత్యావసరాలు మంగళవారం అందజేశారు. అలాగే మాజీ సైనికులను సన్మానించి వారి సేవలను కొనియాడారు. ఇంటర్‌నేషనల్ అడ్మినిస్ట్రేటర్ ఆఫీసర్ గుండా ప్రకాష్, జిల్లా గవర్నర్ రవ్వ గీత, జనగామ గ్రేటర్ అధ్యక్షుడు గుట్ట వెంకటేశ్వర్లు, ప్రమోద్ కుమార్, సిద్ది రవీందర్, రాధాకృష్ణ, మల్లికార్జున్ పాల్గొన్నారు.

నాగరాజు మృతి బాధాకరం



జనగామ రూరల్: గత ఏడు ఏళ్లుగా పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పని చేసి బదిలీపై వెళ్లిన ములకల నాగరాజు గుండె పోటుతో మృతి చెందడం బాధాకరమని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కూరెల్ల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం బార్ అసోసియేషన్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ప్రసాద్‌రావు, శ్రీరాం శ్రీనివాస్, సుధీరంజన్, నాగరాజు, పీపీ స్టీవెన్, భిక్షపతి, రామ్మోహన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, స్వామి, సాధిక్ అలీ, అశోక్ వర్ధన్ రెడ్డి, హరిప్రసాద్, ఎల్లారెడ్డి, తీగల నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పాలకుర్తి టౌన్: మహాత్మా జ్యోతిరావు పూలే కళాశాలలో డిగ్రీలో ప్రవేశాలకు అర్హత కలిగిన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఏరుకొండ హరిప్రసాద్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పూర్తి వివరాలకు మొండ్రాయి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సంధ్యారాణి 9177558295ని, పాలకుర్తిలో ప్రిన్సిపాల్ ప్రసాద్ 9989418015 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

తరిగొప్పుల: టాటా ఏస్ వాహనం ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టడంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొత్తతండాకు చెందిన బానోత్ మంజ్య నాయక్ మండలగూడెంలోని కూతురు ఇంటి వద్ద ముత్యాలమ్మ పండుగ చేసుకుంటుండగా అతని సమీప బంధువు చిల్పూర్ మండలం రాజవరం శివారు తీగల తండాకు చెందిన మాలోత్ తుకారంతో కలిసి ద్విచక్రవాహనంపై వెళ్తున్నారు. ఈ క్రమంలో అక్కరాజుపల్లి క్రాస్ వద్ద వీరి వాహనాన్ని టాటా ఎస్ వాహనం ఎదురుగా వచ్చి బలంగా ఢీకొట్టింది. దీంతో బైక్‌పై వెళ్తున్న మంజ్య, తుకారామ్‌కు కాళ్లు, చేతులు విరగడంతో పాటు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను అంబులెన్స్‌లో జనగామ ఏరియా ఆస్పత్రి తరలించారు.

పాన్‌షాప్‌లో చోరీ

స్టేషన్‌ఘన్‌పూర్: డివిజన్ కేంద్రంలోని బస్టాండ్ సమీపాన ఉన్న క్లాసిక్ పాన్‌షాప్‌లో సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత గుర్తు తెలియని వ్యక్తి చొరబడి చోరీకి పాల్పడ్డాడు. షాపు యజమాని సయ్యద్ సర్వర్ తెలిపిన వివరాల ప్రకారం.. రోజు మాదిరిగా సర్వర్ సోమవారం రాత్రి షాపు బంద్ చేసుకుని ఇంటికి వెళ్లాడు. తిరిగి మంగళవారం ఉదయం షాపునకు వచ్చేసరికి దొంగతనం జరిగిన విషయాన్ని గుర్తించాడు. షాపు కౌంటర్‌లో ఉన్న రూ.15వేల నగదుతో పాటు దాదాపు రూ.20వేల విలువైన సిగరెట్ ప్యాకెట్లు తదితర వస్తువులు చోరీకి గురయ్యాయి. కాగా, గుర్తు తెలియని వ్యక్తి అర్ధరాత్రి 1.30 గంటలకు చోరీ చేసినట్లు సీసీ కెమెరాలో రికార్డు అయింది. షాపు యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఎ.రాఘవేందర్ తెలిపారు.

ఆర్థిక లావాదేవీలపై అవగాహన తప్పనిసరి



దేవరుప్పుల: బహుమతులు అందుకున్న విద్యార్థులతో అధికారులు, ఉపాధ్యాయులు



బచ్చన్నపేటలో..



చిల్పూరులో..



కొడకండ్లలో..

దేవరుప్పుల: జీవితంలో ఏ రంగాల్లో రాణించాలన్నా ప్రతీ ఒక్కరికి ఆర్థిక లావాదేవీలపై అవగాహన తప్పనిసరి అని విద్యాశాఖ మండల నోడల్ అధికారి సిహెచ్ ఉపేందర్ సూచించారు. మంగళవారం మండలంలోని కామారెడ్డిగూడెం హైస్కూల్‌లో ఆర్‌బీఐ సౌజన్యంతో మండలస్థాయి హైస్కూల్ విద్యార్థులకు బ్యాంకింగ్ ఆర్థిక వ్యవస్థపై అవగాహన కల్పించి క్విజ్ పోటీలు నిర్వహించారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన వారికి నగదు బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ బి.కుమారస్వామి, హెచ్ఎంలు ఇంజమూరి శ్రీలత, కళావతి, ఎస్ఎంసీ చైర్మన్ జోగు యాదయ్య,గైడ్ టీచర్ టి హరిప్రసాద్, ఉపాధ్యాయులు రవికాంత్, నాగ తిరుమల, దేవి, ప్రవీణ్‌కుమార్, శ్యామల దేవి, రాజేందర్, భద్రయ్య, వాణిశ్రీ పాల్గొన్నారు.

ఆదాయ, వ్యయాలపై అవగాహన అవసరం

బచ్చన్నపేట: ప్రతి విద్యార్థి ఆదాయ, వ్యయాలపై అవగాహన కలిగి ఉండాలని అప్పుడే డబ్బు విలువ తెలుస్తుందని మండల నోడల్ అధికారి డీవీఎల్ఎన్ మూర్తి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో మండలంలోని అన్ని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలల విద్యార్థులకు ఆర్థిక వ్యవహారాలపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో క్విజ్ పోటీలను నిర్వహించారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన వారికి నగదుతోపాటు మెమొంటోలను ఏపీజీవీబీ మేనేజర్ గురుప్రీత్‌సింగ్ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు పాఠశాల స్థాయి నుంచే డబ్బు విలువ తెలియాలని క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రిన్సిపాల్ కర్ల కృష్ణవేణి, ఉపాధ్యాయులు శ్యాంమోహన్, రాజు, అనుపమ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై క్విజ్ పోటీలు

చిల్పూరు: ఆర్థిక అక్షరాస్యతపై విద్యార్థులకు అవగాహన, పోటీతత్వం పెంపొందించేందుకే క్విజ్ పోటీలను నిర్వహిస్తున్నట్లు ఇండియన్ బ్యాంకు మేనేజర్ శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం రిజర్వ్ బ్యాంకు ఆధ్వర్యంలో మండల స్థాయి ఆర్థిక అక్షరాస్యతపై విద్యార్థులకు క్విజ్ పోటీలను హెచ్ఎం లీల అధ్యక్షతన నిర్వహించారు. గెలుపొందిన వారికి నగదు, మెమొంటోను అందజేశారు. నోడల్ అధికారి రవీందర్‌రావు, ఎస్ఎంసీ చైర్మన్ నేరెళ్ల శైలజగౌరిశంకర్, ఆర్‌బీఐ ప్రతినిధులు ప్రదీప్, సంతోష్, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, సురేష్, భవాని, అరుణ, కోమలి తదితరులు పాల్గొన్నారు.

'మోడల్' విద్యార్థుల ప్రతిభ

కొడకండ్ల: ఆర్థిక అక్షరాస్యత అనే అంశంపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మంగళవారం పాలకుర్తిలో నిర్వహించిన క్విజ్ పోటీల్లో కొడకండ్ల మోడల్‌స్కూల్ విద్యార్థులు ప్రతిభను చాటి ప్రథమ బహుమతి సాధించినట్లు ప్రిన్సిపాల్ సునీత తెలిపారు. మండల స్థాయిలో జరిగిన క్విజ్ పోటీల్లో బి.అరవింద్, కె.నవీన్ ప్రథమ బహుమతిని సాధించి రూ.5 వేల నగదు, ప్రశంసపత్రాలు పొంది జూలై 4వ తేదీన జిల్లా కేంద్రంలో జరిగే జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనారని ఆమె పేర్కొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం



మాట్లాడుతున్న దొమ్మాటి సాంబయ్య

రఘునాథపల్లి: బీఆర్ఎస్ అవినీతి పాలనను అంతమొందించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని టీపీసీసీ ఉపాధ్యక్షుడు దొమ్మాటి సాంబయ్య అన్నారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలోని పలువురు కాంగ్రెస్ సీనియర్ నాయకులను కలిసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం రిటైర్డ్ ఉద్యోగులతో సాంబయ్య సమావేశమై మాట్లాడారు. కాంగ్రెస్‌లో చేరేందుకు వివిధ పార్టీల నాయకులు పెద్ద ఎత్తున ముందుకు వస్తున్నారన్నారు. తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధీ రుణం తీర్చుకునేందుకు పార్టీలకతీతంగా అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్‌కు అండగా ఉండాలని ఆయన పిలుపు నిచ్చారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాపోలు రామ్మూర్తి, కొలపెల్లి సంపత్‌రెడ్డి, ఎండీ ఇబ్రహీంపాషా, కడారి చిన్ననాగేష్, కడారి రవి, గుగులోత్‌వెంకట్‌నాయక్, దుబ్బాక యాదగిరి, గుండా వెంకటయ్య, భాస్కర్, కుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడాలి



నిరసన తెలుపుతున్న దళితులు

తరిగొప్పుల: ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తున్న అక్రమార్కులకు రెవెన్యూ అధికారులు అండగా నిలుస్తున్నారని, ఆ భూమిని కాపాడి వారిపై జిల్లా ఉన్నతాధికారులు చర్య తీసుకోవాలని మండలకేంద్రానికి చెందిన దళితులు డిమాండ్ చేస్తూ మంగళవారం తహసీల్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలకేంద్రంలోని సర్వేనంబర్ 844లోని 1.05 గుంటల భూమిలో నిలువగూడు లేని తాము గతంలో గుడిసెలు వేస్తే రెవెన్యూ అధికారులు, పోలీసులు గుడిసెలను తొలగించి కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు.అట్టి భూమిని ప్రభుత్వ భూమిగా గుర్తించి హద్దు రాళ్లు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. అట్టి భూమిలో పింగిళి నరేందర్‌రెడ్డి, పింగిళి సోమ్‌రెడ్డి, పింగిళి శ్రీరాంరెడ్డి హద్దు రాళ్లను ధ్వంసం చేసి దున్నడం జరిగిందన్నారు. దళితులు గుడిసెలు వేసినప్పుడు తొలగించిన రెవెన్యూ అధికారులు, ట్రాక్టర్‌తో దున్నిన పట్టించుకోవడంలేదన్నారు. వెంటనే ఉన్నతాధికారులు దృష్టిసారించి అన్యక్రాంతం అవుతున్న ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరుతున్నారు. దామెర మైఖేల్, ఎర్రవెల్లి దానియోల్, చింతల ఆనందం, దామెర దాసు, ఎర్రవెల్లి వెంకటయ్య, ఇస్సాక్, యాటెల్లి ఉప్పలయ్య, కాత పౌలు, దామెర బాబు, చింతల కుమార్, ఎల్లయ్య, నవీన్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే చర్యలు తప్పవు

ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ బాశెట్టి హరిప్రసాద్ హెచ్చరించారు. మండలకేంద్రంలోని సర్వే నంబర్ 844లోని ప్రభుత్వ భూమిలో మండలకేంద్రానికి చెందిన బూస కనకయ్య ట్రాక్టర్‌తో చదును చేయడంతో అతనిపై మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. అతనిని విచారించగా పింగిళి వేణుగోపాల్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి వద్ద కౌలుకి తీసుకొని దున్నడం జరిగిందని తెలిపాడన్నారు. అనంతరం ధ్వంసం చేసిన హద్దురాళ్లను రెవెన్యూ సిబ్బంది సరిచేశారు. సర్వేయర్ శ్రీనివాస్, వీఆర్ఏలు రాజపోషయ్య, రవి పాల్గొన్నారు.

కన్యకాపరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు

జనగామ: జనగామ పట్టణంలోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఈ నెల 29న ఏకాదశి పురస్కరించుకుని అమ్మవారిని శాకంబరి అలంకరణ మహోత్సవం చేపట్టనున్నట్లు నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొ న్నారు. అలాగే 30వ తేదీన ద్వాదశి పురస్కరించుకుని దేవాలయంలో అన్నప్రసాద వితరణ ఉంటుందని, దాతలు ముందుకురావాలని కోరారు. మరిన్ని వివరాల కోసం 9247295144 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

పడమటికేశ్వాపూర్‌కు బస్సు సర్వీస్‌ను పునరుద్ధరించాలి

బచ్చన్నపేట: మండలంలోని పడమటికేశ్వాపూర్, లింగంపల్లి గ్రామాలకు విద్యార్థుల సౌకర్యార్థం ఆర్టీసీ బస్సు సర్వీస్‌ను పునరుద్ధరించాలని రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ చల్లా శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం జనగామలో ఆర్టీసీ డిపో మేనేజర్ జ్యోత్స్నను కలిసి వినతి పత్రాన్ని అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమయానుకూలంగా బస్సులు లేక పోవడంతో కళాశాలలు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వస్తుందన్నారు. జనగామ డిపో బస్సును, పూర్వపు ఆకునూర్, సాల్వాపూర్ పికెట్ బస్సును పునరుద్ధరించాలని కోరగా అందుకు డీఎం సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు శశిధర్‌రెడ్డి, నాగిరెడ్డిపల్లి ఉప సర్పంచ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

'ఆరోగ్య మహిళ' కార్యక్రమాన్ని వినియోగించుకోవాలి



కిట్లు పంపిణీ చేస్తున్న డాక్టర్ రవీందర్‌గౌడ్

స్టేషన్‌ఘన్‌పూర్: మహిళల ఆరోగ్య పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఆరోగ్య మహిళా జిల్లా ప్రోగ్రాం అధికారి, జనగామ డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ రవీందర్‌గౌడ్ అన్నారు. ఘన్‌పూర్ సామాజిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం నిర్వహించిన ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మహిళలకు అందిస్తున్న ఆరోగ్య పరీక్షలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని, వారి ఆరోగ్య పరిరక్షణకు ప్రతీ మంగళవారం ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. అనంతరం పదిమంది గర్భిణులకు న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేశారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుధీర్‌కుమార్, ఆస్పత్రి సూపరిండెంట్ డాక్టర్ సంధ్య, వైద్యులు సంధ్య, ప్రసన్నకృష్ణ పాల్గొన్నారు.

రేపు బీరప్ప కామరాతి బోనాలు



మాట్లాడుతున్న మల్లేశం

జనగామ: తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ నెల29న జిల్లా కేంద్రంలో బీరప్ప కామరాతి దేవుళ్లకు బోనాలు సమర్పించనున్నట్లు కురుమ సంఘం పట్టణ అధ్యక్షుడు బాల్దె మల్లేశం తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సంఘ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కురుమ బాంధవులు ప్రతి ఇంటి నుంచి బోనాలతో మధ్యాహ్నం 1 గంటకు బీరప్ప దేవాలయానికి ఊరేగింపుగా బయలుదేరాలన్నారు. పట్టణ ప్రధాన కార్యదర్శి జూకంటి శ్రీశైలం, కోశాధికారి కేమిడి ఉపేందర్, గౌరవ అధ్యక్షులు మోటె దేవేందర్ ఉపాధ్యక్షులు దయ్యాల శ్రీనివాస్, యాదగిరి, రాములు, సత్తెయ్య, ఉపేందర్, మల్లేశం, మధుసూదన్ తదితరులు ఉన్నారు.

'అనుమతి లేని పాఠశాలలకు పంపొద్దు'

స్టేషన్‌ఘన్‌పూర్: అనుమతి లేని ప్రైవేటు పాఠశాలలకు తల్లిదండ్రులు తమ పిల్లలను పంపవద్దని, డివిజన్‌కేంద్రంలోని అక్షర స్కూల్‌కు ఇంతవరకు పర్మిషన్ లేదని మండల విద్యాశాఖ అధికారి, మండల నోడల్ అధికారి ఎండీ. అజామోహినోద్దీన్ అన్నారు. ఘన్‌పూర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన అక్షర స్కూల్‌కు అనుమతులు లేవని, పాఠశాలలోనే విద్యార్థులకు పుస్తకాలు అమ్ముతున్నారని విద్యార్థి సంఘం నాయకుల ఫిర్యాదు మేరకు మండల నోడల్ అధికారి మంగళవారం సదరు పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో పుస్తకాల గదిని ఆయన సీజ్ చేశారు. గిరి, రమేష్ ఉన్నారు.

పంటరుణాల పేర రైతుబంధు డబ్బులు తీసుకోవద్దు



బచ్చన్నపేట: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు పంటల పెట్టుబడి కోసం నేరుగా ఖాతాల్లో జమ చేస్తున్న రైతుబంధు డబ్బులను పంటరుణాల పేరుతో బ్యాంకర్లు తీసుకోవద్దని బీజేపీ మండల అధ్యక్షుడు సద్ది సోమిరెడ్డి అన్నారు. ఈ మేరకు మంగళవారం మండల కేంద్రంలోని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బచ్చన్నపేట బ్రాంచ్ మేనేజర్ శివ శంకర్‌ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. మండల ప్రధాన కార్యదర్శి గణేష్, నాయకులు చిమ్ముల నరేందర్‌రెడ్డి, నాగేష్, వెంకటేష్ పాల్గొన్నారు.

పెంబర్తి ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టు వద్ద నిఘా



చెక్ పోస్టు వద్ద ఆలేరు ఎస్సై, పోలీసులు

జనగామ: బక్రీద్ పండగను పురస్కరించుకుని గోవుల అక్రమ రవాణాను అరికట్టేందుకు జనగామ, యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పోలీసులు జనగామ మండలం పెంబర్తి నేషనల్ హైవేపై ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్టు వద్ద నిఘా పెంచారు. జనగామ పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా, విధి నిర్వహణలో భాగంగా ఆలేరు ఎస్సై శ్రీనివాస్ తన బృందంతో కలిసి చెక్ పోస్టు వద్ద మంగళవారం తనిఖీలు చేపట్టారు. గోవుల అక్రమ రవాణా చేయొద్దని హెచ్చరించారు.

అన్యాక్రాంతమైన భూమి తిరిగి స్వాధీనం



భూమి కొనుగోలు పత్రాలు చూపిస్తున్న చెంద్రారెడ్డి

బచ్చన్నపేట: మండలంలోని చిన్నరామన్‌చర్ల రెవెన్యూ శివారులోని బచ్చన్నపేట, జనగామ మెయిన్ రోడ్డులో గల భూమిని ఇటీవల పలువురు ఆక్రమించారని అట్టి భూమిని తిరిగి స్వాధీనపర్చుకున్నామని భూ యజమాని చెంద్రారెడ్డి తెలిపారు. మంగళవారం భూమిని విక్రయించిన మల్లా ఐలయ్యతో కలిసి మాట్లాడారు. 2018లో 185/సి/3/2 సర్వేనంబర్‌లో ఒక ఎకరం భూమిని కొనుగోలు చేశానని, ఆ భూమి చుట్టూ ఫెన్సింగ్ చేసి అందులో బోరు కూడా వేశానని తెలిపారు. ఆ భూమికి పట్టాదారు పాసుపుస్తకం కూడా వచ్చిందన్నారు. ఆ తర్వాత జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ గిరబోయిన భాగ్యలక్ష్మి భర్త అంజయ్య దౌర్జన్యం చేసి తన పట్టా భూమిని ఆక్రమించాడని.. ఇదేమిటని ప్రశ్నిస్తే బెదిరించాడని తెలిపారు. ఆయనకు భయపడి భూమి జోలికి వెళ్లక రెవెన్యూ అధికారుల చుట్టూ తిరిగామని చెప్పారు. రెవెన్యూ అధికారులు కూడా అంజయ్య పదవిని చూసి ఆయనకే సహకరించారని, ఇటీవల వరంగల్ సీపీ రంగనాథ్‌ను ఆశ్రయిస్తే మీ భూమిని మీరే సేద్యం చేసుకోండని తెలుపగా తమ భూమి చుట్టూ నూతన ఫెన్సింగ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎప్పటికైనా న్యాయమే గెలుస్తుందని.. తమ గోడు విని సహకరించిన సీపీకి కృతజ్ఞతలు తెలిపారు.

క్విజ్ పోటీలో యువత పాల్గొనాలి

కొడకండ్ల: రాజీవ్‌గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ పోటీలో పాలకుర్తి నియోజకవర్గంలోని యువకులు అధిక సంఖ్యలో పాల్గొనాలని నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ధరావత్ రాజేష్‌నాయక్ కోరారు. మంగళవారం మండలంలోని గిర్నితండా గ్రామ పంచాయతీ పరిధిలోని యువకులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ యూత్ డిక్లరేషన్ స్ఫూర్తితో తెలంగాణలోని యువశక్తిని మేల్కొలిపే దిశగా రాజీవ్‌గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ కాంపిటిషన్ దోహదపడుతుందని, జూలై 2న నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో పాల్గొనదల్చిన వారు రిఫరల్ కోడ్ 1171తో రిజిస్టర్ చేసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ వెబ్ లింక్‌తో కూడిన ఎస్ఎంఎస్‌ను పొందేందుకు 7661899899 నంబర్‌కు మిస్డ్‌కాల్ ఇచ్చి రిజిస్టర్ చేసుకోవచ్చని ఆయన తెలిపారు. సుధీర్ నాయక్, హేమాని, హరిచందర్, శ్రీకాంత్, నవీన్, మధు, గణేష్, సంతోష్ ఉన్నారు.

మొక్కలు నాటండి

బచ్చన్నపేట: గ్రామాల్లో రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటాలని ఎంపీడీఓ రఘురామకృష్ణ అన్నారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి పల్లె ప్రగతి పనులను, మొక్కలు నాటడాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమైనందున అందరూ మొక్కలను నాటాలని అన్నారు. వన నర్సరీల్లోని మొక్కలను రైతుల పొలం గట్లపై ప్రభుత్వ స్థలాల్లో నాటించాలన్నారు. అలాగే గ్రామాల్లో పర్యటించి పారిశుద్ధ్య పనులను కూడా పరిశీలించారు.

బస్సు సర్వీసు ప్రారంభం



బస్సు సర్వీస్‌ను ప్రారంభిస్తున్న సర్పంచ్ ఉమారాణి

రఘునాథపల్లి: మండలంలోని మండలగూడెంకు ఆర్టీసీ అధికారులు మంగళవారం బస్సు సర్వీస్ పునరుద్ధరించారు. సర్పంచ్ ఉత్తెపు ఉమారాణిసత్యనారాయణ వార్డు సభ్యులు, గ్రామ పెద్దలతో కలిసి బస్సు ముందు ప్రత్యేక పూజ చేసి సర్వీస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ జిల్లా కేంద్రానికి వచ్చే బస్సు సర్వీస్‌ను గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అంతకు ముందు దివ్యాంగులకు ఉచిత బస్సుపాసులకు సర్పంచ్ తన సొంత డబ్బులు ఇవ్వడంతో ఆర్టీసీ అధికారులు అభినందించారు. ఉప సర్పంచ్ పుప్పాల వేణుకుమార్, ఆర్టీసీ విలేజ్ బస్సు ఆఫీసర్ కుర్ర సురేందర్‌గౌడ్, వార్డు సభ్యులు మల్లక్క, వనజ, యాదలక్ష్మి పాల్గొన్నారు.

కులవృత్తుల దరఖాస్తుల పరిశీలన

లింగాలఘణపురం: బీసీ కులవృత్తులకు రూ.లక్ష రుణం అందజేసే పథకానికి వచ్చిన దరఖాస్తులను మంగళవారం పంచాయతీ కార్యదర్శులు పరిశీలించారు. కులం, ఆదాయం, రేషన్‌కార్డు, వయస్సు తదితర వివరాలను పరిశీలించి అనర్హులను తొలగించారు. మండలంలో ఇప్పటి వరకు 906 దరఖాస్తులను పరిశీలించారు. 14కులాలకు సంబంధించిన బీసీ కుల వృత్తుల వారిని మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం సూచించడంతో కొంత మంది పద్మశాలీలు, గౌడకులస్తులు దరఖాస్తు చేసుకోవడంతో వాటిని తొలగించారు. అంతేకాకుండా 18 నుంచి 55 ఏళ్ల వారు దరఖాస్తు చేసుకోవాల్సి ఉండగా 55 ఏళ్లపై వయస్సున్న వారి దరఖాస్తులను కూడా తొలగించారు.

నాణ్యమైన విత్తనాలు వాడాలి

పాలకుర్తి: రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ద్వారా సరఫరా చేసే నాణ్యమైన విత్తనాలను వాడాలని మండల వ్యవసాయ అధికారి వరలక్ష్మి రైతులకు సూచించారు. ఈ మేరకు మంగళవారం పాలకుర్తిలో విత్తనాల వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. విత్తనాభివృద్ధి సంస్థ రీజినల్ మేనేజర్ బి. రఘు, పి.నవ్య, ఏఈఓ రాధిక, రైతులు తదితరులు పాల్గొన్నారు.

హత్యా రాజకీయాలు చేయను

- సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు సతీష్‌రెడ్డి



మాట్లాడుతున్న సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు సతీష్‌రెడ్డి

బచ్చన్నపేట: మండలంలోని కొడవటూర్ గ్రామంలోని స్వయంభూ సిద్దేశ్వరాలయంలోని మొదటి మెట్టు వద్ద అడుక్కుతింటాను తప్ప హత్యా రాజకీయాలు చేయనని మండలంలోని కొడవటూర్ సర్పంచ్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు గంగం సతీష్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఇటీవల హత్యకు గురైన రిటైర్డ్ ఎంపీడీఓ నల్ల రామకృష్ణయ్య మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రామకృష్ణయ్య హత్యతో తనకు సంబంధం ఉందని మృతుడి కుటుంబ సభ్యులు ఆరోపించడాన్ని ఖండిస్తున్నానన్నారు. తాను రెండు పర్యాయాలు వరుసగా సర్పంచ్‌గా కొనసాగుతున్నానని రామకృష్ణయ్య అనే వ్యక్తి అసలు తనకు పరిచయమేలేదన్నారు. రాజకీయంగా తన ఎదుగుదలను చూసి ఓర్వలేని వారు తనపై బురద చల్లాలని అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. అసలు దోషులను గుర్తించాలని సీఐ నాగరాజు, డీసీపీ సీతారాంకు ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బొడిగం చెంద్రారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ పూర్ణచందర్, సర్పంచ్‌లు వడ్డెపల్లి మల్లారెడ్డి, గిద్దెల రమేష్, నాయకులు మూసిని రాజు, మేకల రాజు, వెంకట్‌రెడ్డి, నర్సిరెడ్డి, శశిధర్‌రెడ్డి, షబ్బీర్, అశోక్, కనుకయ్య, శ్రీనివాస్, ఆజామ్, సిద్దులు, బాల్‌రాజు, వినోద్, నరేందర్, సుధాకర్ పలువురు పాల్గొన్నారు.